

శ్రీరాములును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ధరూరు, సెప్టెంబర్ 30: మండలంలోని మార్లబీడులో బీఆర్‌ఎస్ నాయకుడు సర్పంచ్ సుజాతాశ్రీరాములును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. శ్రీరాములు తండ్రి అంజనప్ప, అనారోగ్యంతో చనిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వెళ్లి, అంజనప్ప పార్థీవదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. శ్రీరాములు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోస్టర్ విడుదలకు హాజరుకానున్న ఎమ్మెల్యే

అలంపూర్, సెప్టెంబర్ 30: అలంపూర్ క్షేత్రంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆలయంలో ఆదివారం చేపట్టిన పోస్టర్, కరపత్రాలు విడుదల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అబ్రహం హాజరు కానున్నారని ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొనాలని కోరారు.

## రైతు కుటుంబానికి పరామర్శ




రైతు ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తనయుడు సాయిసాకేత్‌రెడ్డి

గద్వాలఅర్బన్, సెప్టెంబర్ 30: కేటీదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన రైతు బోయ ఆంజనేయులు పాముకాటుతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తనయుడు బండ్ల సాయిసాకేత్ రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికారప్రతినిధి మోనేశ్ మారోజు, మన్నాపురం సర్పంచ్ మహబూబ్, నవీన్ కుమార్‌రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

## రెండు గ్లాసుల పద్ధతి పాటించొద్దు

మల్దకల్, సెప్టెంబర్ 30: మండలంలోని హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి పాటించొద్దని ఆర్ఐ నాగిరెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని పాల్వాయిలో సర్పంచ్ శివరామిరెడ్డి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్ఐ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా ఉండాలని, అలాగే ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అయ్యపురెడ్డి, వార్డుసభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## మద్దూరులో పౌరహక్కుల దినోత్సవం

మానవపాడు, సెప్టెంబర్ 30: మండలంలోని మద్దూరులో అధికారులు, సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. రెండుగ్లాసుల పద్ధతి, దేవాలయంలోకి రాకుండా అడ్డుకోవడం వంటివి పాటిస్తున్నారా అని గిర్దావర్ గ్రామస్తులను అడిగారు. గ్రామంలో ఎలాంటి విభేదాలు లేకుండా అంతా కలిసిమెలిసి ఉన్నామని గ్రామస్తులు చెప్పారు.

## ఆలయంలో భక్తుల రద్దీ

మల్దకల్, సెప్టెంబర్ 30: ఆదిశిలాక్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి అర్చకులు రవిచారి, మధుసూదన్‌చారి, ధీరేంద్రదాస్ ఆధ్వర్యంలో ఉదయం బిందెసేవా, పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. అలాగే సద్దలోనిపల్లిలో వెలసిన కృష్ణాస్వామి ఆలయంలో, పాల్వాయిలో అడవిఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

## టీబీపై అవగాహన

మానవపాడు, సెప్టెంబర్30: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రిజ్వాన టీబీపై అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించారు. జ్వరం, దగ్గు, తెమడ పడడం, బరువు తగ్గడం వంటివి టీబీ లక్షణాలని చెప్పారు. ఈ వ్యాధి ఉన్నవారికి తెమడ పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామని, నెలకు రూ.500 ఖాతాలో జమ చేస్తామన్నారు. లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు.

# దేశ సేవ ఎంతో గొప్పది

- మేరి మట్టి.. మేరా దేశ్ అమృత్‌కలశ్ యాత్ర
- అమరవాయిలో పాల్గొన్న డీఈవో సిరాజుద్దీన్

మల్దకల్, సెప్టెంబర్ 30: దేశ సేవ ఎంతో గొప్పదని జిల్లా విద్యాధికారి సిరాజుద్దీన్ అన్నారు. మేరి మట్టి– మేరా దేశ్ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంతో పాటు అమరవాయి జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. అమరవాయి పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో సిరాజుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మట్టితో తయారు చేసిన కలశాన్ని అలంకరించుకొని విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మట్టి విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద పంచప్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ముఖ్యంగా దేశసేవ ఎంతో గొప్పదన్నారు. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్పతనం అని చెప్పారు. గ్రామంలో ఇండియన్ ఆర్మీకి ఎంపికైన రాజు తల్లిదండ్రులు మేకల బొజ్జన్న, దానమ్మ, సుంకన్న తల్లిదండ్రులు పుష్పమ్మ బుడ్డన్న, రాజేశ్ తల్లిదండ్రులు వెంకటన్న, సుశీలను డీఈవో, జీహెచ్‌ఎం నరేశ్ శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం మట్టితో చేసిన కలశాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతికి పంపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నరేశ్, పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, ఉపాధ్యాయులు జానకమ్మ, సుమలత, అనిత, వీణకుమారి, ప్రసన్నకుమార్, విద్యార్థులు, పాఠశాల పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



అమరవాయి పాఠశాలలో ఇండియన్ ఆర్మీ విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న డీఈవో సిరాజుద్దీన్



అమరవాయిలో పంచప్రాన్ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

**మల్దకల్‌లో..**

మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శనివారం ఎంపీడీవో కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆదిశిలా క్షేత్రం పరిసరాలతో పాటు స్వామివారి పుష్కరిణీ పరిసరాలను శుభ్ర పర్చిచారు. కార్యక్రమంలో ఈవో సత్యచంద్రారెడ్డి, కార్యదర్శి మహబూబ్‌బీ, ఉపాధి హామీ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల్లో మరింత చైతన్యం తేవాలి



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఈవో కొండారెడ్డి

గట్టు, సెప్టెంబర్ 30: సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుండాలని ఎంఈఓ కొండారెడ్డి అన్నారు. విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని సూచించారు. మండలంలోని రాయాపురం ఎంపీయూపీఎస్ ఆవరణలో గ్రామ స్వరాజ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కార్యక్ర మం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా సంస్థ ఎంపిక చేసిన పది మందిని ఘనంగా సన్మానించారు. వారిలో వెంకటేశ్, రఘులక్ష్మణ్, శశిరేఖ, వీరేశ్, కిశోర్‌కుమార్, రమేశ్, ప్రియాంక, రమేశ్, జగదీశ్వరచారి, విశ్వతేజ ఉన్నారు. ఈ సందర్భంగా రూ.10వేల విలువ చేసే టై, బెల్ట్, బ్యాడ్జీలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. రాబోయే డీఎస్సీ ద్వారా మండలంలోని ఉపాధ్యాయుల ఖాళీలను పూర్తిచేస్తే ఉపాధ్యాయుల కొరత తీరుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. గ్రామ స్వరాజ్యం గౌరవ సలహాదారు, రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గట్టు వార్డుసభ్యుడు రమేశ్, పాఠశాల హెచ్‌ఎం అశ్విని, నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రతాప్, కొండాపురం ప్రతాప్, ఉపాధ్యాయులు రాజుసాగర్, పరశురాం పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆర్పీల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మెప్మా ఆర్పీలు

అయిజ, సెప్టెంబర్ 30: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆర్పీలు శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేం చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో విధులు నిర్వహిస్తున్న రిసోర్స్‌పర్సన్లు (ఆర్పీ)లకు రూ.2వేలు అదనంగా గౌరవ వేతనం పెంచడంతో హర్షం వ్యక్తంచేశారు. గతంలో నెలకు రూ.4వేలు మాత్రమే అందజేసే వారని, ఆర్పీల పనిని గుర్తిస్తూ గౌరవ వేతనం పెంచడం సంతోషకరమని అన్నారు. కేసీఆర్‌కు రుణపడి ఉంటామని మెప్మా ఆర్పీ లలిత పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, పరిమళ సువర్ణ, ఆనందమ్మ, గంగమ్మ, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్‌కు వరద

అయిజ, సెప్టెంబర్ 30: కర్ణాటకలోని రాజోళి బండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్) ఆనకట్టకు వరద కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వానలకు శనివారం ఇన్‌ఫ్లో 7,952 క్యూసెక్కులుగా ఉంది. అవుట్‌ఫ్లో 7,440 క్యూసెక్కులు నమోదైంది. ఎగువ నుంచి వచ్చే వరద ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 512 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు కర్ణాటక ఆర్డీఎస్ డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.9 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 1,530 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,739 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 56.505 టీఎంసీల నీటి నిల్వఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ, ప్రస్తుతం 1618.23 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# ఆత్మీయ సమ్మేళనానికి తరలిన దళితులు



మల్దకల్ నుంచి బయలుదేరిన దళితులు

మల్దకల్, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమ్మేళనం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల దళితులు గద్వాలకు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరారు. మండల కేంద్రం నుంచి సర్పంచ్ యాకూబ్, మద్దెలబండ నుంచి దళితులు, బిజ్వారంలో సర్పంచ్ లక్ష్మన్న ఆధ్వర్యంలో వెళ్లారు. అలాగే వివిధ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

**గద్వాల మండలం నుంచి..**

గద్వాల రూరల్, సెప్టెంబర్30: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న దళితుల ఆత్మీయ సమ్మేళనానికి గద్వాల మండలంలోని గోనుపాడు, అనంతపురం, జమ్మిచేడు, గుంటిపల్లి, కొత్తపల్లి, సంగాల, బీరెల్లి, ముల్కలపల్లి, పరుమాల, శెట్టిఆత్మకూర్, మెల్లచెర్వు, పూడూరు నుంచి దళితులు భారీఎత్తున బైక్ ర్యాలీతో జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు.

**ధరూరు మండలం నుంచి..**

ధరూరు, సెప్టెంబర్ 30: జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధ్యక్షతన బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన దళితుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మండలం నుంచి దళితులు పెద్దఎత్తున తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, జై బీఆర్‌ఎస్ అంటూ నినదిస్తూ తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ధరూరు నుంచి బయలుదేరుతున్న నాయకులు



మాల్‌దొడ్డి నుంచి తరలుతున్న నాయకులు